క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన

జంగారెడ్డిగూడెం రూరల్ : విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జెడ్పీటీసీ సభ్యుడు బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

చింతలపూడి: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించడంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం రాఘవాపురం గ్రామంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పురుగు మందుల అధిక వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మీనాకుమారి, రైతులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు అభినందనలు

కొయ్యలగూడెం : పోలవరం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన ఆరేటి శాంతకుమారిని మహిళా ప్రజాప్రతినిధులు గురువారం అభినందించారు. బుట్టాయిగూడెం జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మితో పాటు ఎంపీపీ కారం శాంతిరమణ, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ తదితరులు శాంతకుమారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొయ్యలగూడెంలో ఉన్న ఏఎంసీ యార్డు అభివృద్ధికి కృషి చేయడంతో పాటు వారంలో ఒకరోజు పశుసంత రైతులు నిర్వహించుకునేలా కృషి చేస్తానని శాంతకుమారి హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్, ముగ్గురు డైరెక్టర్లను కొయ్యలగూడెం నుంచి ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ నూకల రాము కృతజ్ఞతలు తెలిపారు.

పొగాకు రైతు సమస్యల పరిష్కారానికి కృషి

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : పొగాకు రైతు సమస్యల పరిష్కారానికి చిత్త శుద్ధితో కృషి చేస్తానని ఘంటసాల గాంధీ తెలిపారు. జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు వేలం కేంద్రంలో జరిగిన పొగాకు రైతు సంఘం ఎన్నికల్లో తాను అధ్యక్షునిగా ఎన్నికైనట్లు గాంధీ గురువారం సాయంత్రం తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రైతులు కరాటం రెడ్డిబాబు, గద్దే లక్ష్మణరావు, పిన్నమనేని రాధాకృష్ణ, సుంకరవల్లి వీరభద్రం, తదితరులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా గాంధీని పలువురు రైతులు ములగలంపల్లిలోని ఆయన నివాసంలో పూలమాలలతో సత్కరించారు.

రోగులకు మానవత్వంతో సేవలందించాలి

పోలవరం రూరల్ : ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మానవత్వంతో సేవలు అందించాలని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ (పీఆర్‌సీ) విశాఖపట్టణానికి చెందిన వైద్యాధికారి వై.రమణ సూచించారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వైద్యశాలల పరిశీలనలో భాగంగా గురువారం ఆయన మరో వైద్యాధికారి పి.శ్రీనివాస్‌తో కలిసి పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో వసతులు, భవనాలు, ఓపీ రిజిస్టర్, రోగులకు అందుతున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యశాలకు అదనంగా కావాల్సిన వసతులపై ఆరా తీశారు. నివేదికను మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖకు పంపనున్నట్లు చెప్పారు. ఈయన వెంట డాక్టర్లు జి.జ్యోతి, రేణుక పాల్గొన్నారు.

పశువుల టీకా శిబిరం ప్రారంభం

కొయ్యలగూడెం: పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి నివారణకు నెల రోజులపాటు టీకా శిబిరం నిర్వహిస్తున్నట్లు కొయ్యలగూడెం పశువైద్య శాఖ అధికారి బీవీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం పశు వైద్య కేంద్రం వద్ద టీకా వైద్య శిబిరాన్ని ఎంపీపీ గంజిమాల రామారావు ప్రారంభించారు. ఆవులు, ఎద్దులకు ముద్ద చర్మవ్యాధి ప్రబలుతుందని, దీని నివారణకు టీకాలు తప్పనిసరి ఇప్పించాలని సూచించారు. అలాగే హెచ్ఎస్, బీపీ, ఈటీ, బీటీ వ్యాధులకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ వార్డు సభ్యుడు పి.రవి, పశు వైద్య సిబ్బంది మణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి డీఎస్పీ ఎం.ధనుజయుడిని కోరారు. మేరకు గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. జంగారెడ్డిగూడెం పట్టణం దినదినాభివృద్ధి చెందుతోందని, దానికి అనుగుణంగా జనాభా పెరుగుదల, చుట్టుపక్కల గ్రామాల నుంచి వివిధ అవసరాల నిమత్తం ప్రజలు పట్టణానికి రావడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని వివరించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు.

మెట్టలో వరినాట్ల జోరు

- 50 శాతం వరినాట్లు పూర్తి
- వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వేగంగా పనులు
- ఆలస్యమైతే వెదజల్లే పద్ధతి మేలంటున్న అధికారులు



వెంకటాపురంలో ట్రాక్టర్‌తో దమ్ము దుక్కులు చేసుకుంటున్న రైతు

చింతలపూడి: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మెట్ట ప్రాంతంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. గత నెలలో కురిసిన వర్షాలకు మెట్ట రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. చింతలపూడి సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 50 శాతం వరినాట్లు వేయడం పూర్తయినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో 36,343 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 19,259 కరాలు లక్ష్యం కాగ ఇప్పటి వరకు 8,750 ఎకరాలు, లింగపాలెం మండలంలో 7,707 ఎకరాలకు గాను 4,250 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 4,550 ఎకరాలకు 1,670 ఎకరాలు, టి నరసాపురం మండలంలో 4,827 ఎకరాలకు గాను



నారుమడిలో నారు సేకరిస్తున్న రైతు

3,379 ఎకరాలు నాట్లు వేయడం పూర్తయ్యింది.

వర్షపాతం వివరాలు

సబ్‌డివిజన్‌లోని చింతలపూడి మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 482.7 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 461.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లింగపాలెం మండలంలో 417.2 మిల్లీమీటర్లకు 261 మిల్లీ మీటర్లు, కామవరపుకోట మండలంలో 428.5 మిల్లీమీటర్లకు 451.4 మిల్లీమీటర్లు, టి నరసాపురం మండలంలో 420.7 మిల్లీ మీటర్ల వర్షపాతానికి 495.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆందోళన వద్దు

వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఆలసంగా వరి సాగులో రైతులు దమ్ము చేసిన పొలంలో నేరుగా వరి విత్తే పద్ధతిని ఆచరించడం మేలు. వారం పది రోజుల ముందుగానే పంట కోతకు వస్తుంది. డ్రమ్ సీడర్‌తో విత్తితే ఒకేసారి 8 వరుసల్లో విత్తనాలు పడతాయి. సాళ్ల మధ్య 20 సెం.మీ, మొక్కల మధ్య 5-8 సెం.మీ ఎడంగా గింజలు పడతాయి. ప్రతీ 16 వరసలకు ఒక అడుగు కాలిబాట వదలాలి.



-బి.నాగకుమార్, ఏడీఏ

రహదారి నిర్మాణ పనుల ప్రారంభం



పోలీస్‌స్టేషన్ వద్ద బీటీ రోడ్డును తవ్వుతున్న జేసీబీ

ద్వారకాతిరుమల: స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వసంత్ నగర్ కాలనీకి వెళ్లే రహదారి నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. లక్షలాది రూపాయలతో ఈ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తొలిరోజు పాత బీటీ రోడ్డు తవ్వకం పనులను జేసీబీ సహాయంతో చేపట్టారు. పోలీస్ స్టేషన్ నుంచి పోలీస్ క్వార్టర్స్ మలుపు వరకు ఈ బీటీ రోడ్డును నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురం - జంగారెడ్డిగూడెం రహదారి గోతులమయంగా మారడంతో గురువారం మరమ్మతులు చేపట్టారు. ఆయిల్ పామ్ కర్మాగారం యాజమాన్యం సహకారంతో రహదారి మరమ్మతులు చేస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి సూచనల మేరకు పనులను శ్రీనివాసపురం సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు జుజ్జవరపు తాతారావు పనులను పరిశీలించారు. రైతులు, అనేక గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడే ఈ రహదారి మరమ్మతులకు సహకరించిన ఆయిల్‌పామ్‌యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోల్నాటి రాజా, సిర్రా రాజేష్,, దంసెల్లి కృష్ణ,, జుజ్జవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

చింతలపూడి: మండలంలోని మేడిశెట్టివారిపాలెం గ్రామ శివారున పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేసినట్లు సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు తెలిపారు., దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,01,650 నగదు, 13 సెల్ ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై కె.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

వివాహిత అదృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక రాజుల కాలనీకి చెందిన వివాహిత కనిపించడం లేదని ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశామని హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. తన భార్య ఇంట్లోని 10 కాసుల బంగారం, దుస్తులు, సెల్‌ఫోన్‌తో సహా అదృశ్యమైనట్లు ఫిర్యాదులో భర్త పేర్కొన్నారు. అలాగే తనకు చిత్తూరుకు చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉందని ఆ మేరకు దర్యాప్తు చేయాలని పోలీసులను ఆశ్రయించాడు.

'జగనన్న సురక్ష' సూపర్ డూపర్ హిట్

చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: 'జగనన్న సురక్ష' కార్యక్రమం సూపర్ డూపర్‌గా హిట్ అయ్యిందని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అపూర్వంగా డిజైన్ చేశారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎప్పుడూ జరగని విధంగా జగనన్న అధికారం చేపట్టిన తరువాత ప్రజా సంక్షేమం ధ్యేయంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పరిపాలనను గ్రామ స్థాయికి తీసుకువచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పరిపాలన తీసుకువచ్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా కులం, మతం, ప్రాంతం, రాజకీయం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే గుర్తించేందుకు ×జగనన్న సురక్ష¥ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో చేరువైన కుటుంబాలు 1,02,851 కాగా, జగనన్న సురక్ష శిబిరాలు 90 నిర్వహించామని ఎమ్మెల్యే చెప్పారు. 61,704 మంది దరఖాస్తులు చేసుకోగా, 61,179 ధ్రువీకరణపత్రాలు జారీ చేశామన్నారు. 99 శాతం ధ్రువీకరణపత్రాలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాల పద్మ, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ కమిటీ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పందు జగదీష్, కౌన్సిలర్‌లు మాధవ, కిషోర్, ఉగ్గం ప్రసాద్, నాయకులు బత్తిన చిన్న తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

ప్రతి కుటుంబానికీ పథకాల లబ్ధి



ఎల్ఎన్‌డీపేటలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : ప్రభుత్వం పథకాల ద్వారా ప్రతి ఒక్క కుటుంబానికీ లబ్ధి చేకూరుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీపేట గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ప్రతి కుటుంబానికి పథకాలు అందేలా చూడాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామంలోని పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ మిడియం సింగరాజు, ఎంపీడీఓ జి.శ్రీను, ఎంపీటీసీ దాపర్తి మోహన్‌రావు, దత్తి రాంబాబు, మార్గాని పోసి, ఇళ్ల కల్యాణ్, ధూళి బాపిరాజు, పాదం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం : మండలంలోని బైనేరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చెట్ల నరికివేత సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బైనేరు టౌన్ ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో ఉన్న కొవ్వూరు రోడ్, బుట్టాయగూడెం రోడ్, పద్మ థియేటర్, మార్కండేయపురం, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా ఏజెన్సీ బంద్



పోలవరంలో నిరసన సీపీఎం శ్రేణులు

బుట్టాయగూడెం: మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నిరసిస్తూ, ఆదివాసీలపై దాడులను ఆపాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఏజెన్సీ బంద్ ప్రశాంతంగా జరిగింది. బంద్ సందర్భంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలంలో వ్యాపార దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను ప్రజా సంఘాల నాయకులు మూయించి వేశారు. బుట్టాయగూడెంలో విద్యార్థులతో ర్యాలీ చేశారు. అలాగే స్థానిక నెహ్రూ సెంటర్లో మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజనులకు రక్షణ కలిగించాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారం భాస్కర్, మొడియం నాగమణి, చంద్రు బుల్లెమ్మ, కొయ్యల శ్రీను, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే జీలుగుమిల్లి జరిగిన కార్యక్రమంలో తెల్లం దుర్గారావు, ఎస్‌వి అప్పారావు, వంశీ, భీమ శంఖరం, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

టి.నరసాపురం : మణిపూర్‌లో హింసకాండకు నిరసనగా క్రైస్తవ నాయకులు, విశ్వాసులు గురువారం టి.నరసాపురంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా చేరుకుని మణిపూర్‌లో శాంతిభద్రలు నెలకొల్పేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద దేశ క్షేమం కోరుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో యూపీఏ అధ్యక్షుడు ఆర్.మోషే, గౌరవాధ్యక్షుడు డి.శామ్యుల్ రాజు, కార్యదర్శి ఎ.బాలస్వామి, బలే పాలు రాజేశ్వరరావు, బి.కిషోర్, సీఎస్ఐ పాస్టర్ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దాడులపై నిరసన

పోలవరం రూరల్: మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన పోలవరం ఏటిగట్టు సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గూడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజనులు, గిరిజన చట్టాలపైనా అప్రకటిత దాడి ప్రారంభించిందని, దానిలో భాగంగానే అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేసిందన్నారు. మణిపూర్ రాష్ట్రంలో జాతుల మధ్య చిచ్చు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో చంద్రావు, తామ బాలరాజు, మడివి చలపతి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

బుట్టాయగూడెం : వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్త, నాయకునికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి గుర్తింపు ఇస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. నూతంగా నియమితులైన పోలవరం ఏఎంసీ చైర్‌పర్సన్ ఆరేటి శాంత కుమారి, తన భర్త పార్టీ సీనియర్ నాయకుడు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణతో కలిసి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బాలరాజును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కమిటీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కమిటీ మెంబర్ బోదా శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ కారం శాంతి, జడ్పీటీసీలు మొడియం రామతులసి, దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, కరాటం కృష్ణ స్వరూప్, తెల్లం చిన్నారావు తదితరులు ఉన్నారు.

చందా ప్రసాద్ నియామకానికి సిఫార్సు

వైఎస్సార్ సీపీ జీలుగుమిల్లి మండల కన్వీనర్‌గా కామయ్యపాలెంకు చెందిన చందా ప్రసాద్‌ను నియమించేలా అధిష్టానానికి సిఫార్స్ లేఖ పంపినట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. గురువారం అయన విలేకర్లతో మాట్లాడుతూ త్వరలోనే ప్రసాద్ నియామకంపై ఉత్తర్వులు వెలువడతాయని చెప్పారు. అలాగే బుట్టాయగూడెం సొసైటీ అధ్యక్షుడిగా కొమ్ముగూడేనికి చెందిన కలగర నానిని నియమించేలా అధిష్టానాన్ని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ శాంతకుమారి

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల అందజేత

టి.నరసాపురం : వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ యువజన నాయకులు దేవరపల్లి సీతారామయ్య, కన్నం సర్వేశ్వరరావులు అన్నారు. గురువారం మెట్టగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను సర్పంచ్ సునంద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిట్‌లో పది రకాల పౌష్టికాహార పదార్థాలు ఉన్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ఇస్తున్న పోషకహార పదార్థాలు తీసుకుని గర్భిణులు, బాలింతలు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్‌డీ పేటలో..

పోలవరం రూరల్ : మండలంలోని ఎల్ఎన్‌డీపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్‌ను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిడియం సింగరాజు పాల్గొన్నారు.



మెట్టగూడెంలో సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న దృశ్యం

శివపురంలో..

చింతలపూడి: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.నీరజ అన్నారు. మండలంలోని శివపురం గ్రామంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని రక్త హీనతకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో కిట్లను అందిస్తున్న దృశ్యం

తల్లిపాలపై అవగాహన

కొయ్యలగూడెం : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా దిప్పకాయలపాడు పంచాయతీ తంగెళ్లగూడెంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ సున్నం శాంతకుమారి తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. టేక్ హోం రేషన్ ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ లబ్ధిదారులకు సకాలంలో అందించామని పేర్కొన్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సున్నం వెంకటేశ్వరరావు, వాసం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.